# సరళరేఖ




పి. సత్యవతి

"నీ కోసం సరళొచ్చి వెళ్ళింది. అదే_స్టేట్ బ్యాంకు సరళ కాదు పిహెచ్‌డీ సరళ. ఫ్లాస్కులో కాఫీ వుంది త్రాగు. బజ్జీలు నువ్వు తినవుగా. తింటే టేబిల్ మీదే వున్నాయి. ఇవ్వాళ తమిళనాడులో అత్తయ్యా మామయ్యా వచ్చి వెంటనే బస్సులో పామర్రు వెళ్ళేరు. సుబ్బులు పనికి రాలేదా? వావళ్ళు హూనం అయిందనుకో."

చెప్పులు స్టాండ్‌లో పెట్టి, హ్యాండ్‌బ్యాగ్ మేకుకి తగిలించి, కూజాలో నుంచి కొంచెం మంచినీళ్ళు తాగేలోగా ఆ రోజు విశేషాలన్ని పూసగుచ్చేసింది అమ్మ.

"సరళని కూర్చో మనక పోయావా" అన్నాను నోరుజారి-

"ఇంటి కొచ్చిన పిల్లని - అందులో నీ ఫ్రెండ్‌ని వుండమనా ఏం? బజ్జీలు పెట్టి, కాఫీ కూడాయిచ్చేను-తనే బంగారం కొట్లో పనుందని వెళ్ళింది- మళ్ళీ వస్తుందిలే-" అననే అంది అమ్మ- "నువ్వు కూర్చోమనే వుంటావు- నాకు తెలుసు"

"ఏదో మాట వరుసకి అన్నాను- సుబ్బులు ఈ పూటా రాలేదన్న మాట- నేను స్నానం చేసి వచ్చి వంట ఇంటి పని చూస్తాను- నువ్వు వెళ్ళి రెస్ట్‌తీసుకో" అని ఆవిణ్ణి అనునయించేను.

"నీ మొహం- అక్కడ చేసీ చేసీవచ్చి ఇంకేం చేస్తావు- సరళొచ్చేలోగా స్నానం అదీకానీ- ఇంకేం పని లేదులే-" అంది.

ఇది మా ఇద్దరికీ మామూలే-

సరళదిచిన్నప్పటినించీ ఫస్ట్‌ర్యాంకే-ప్రతిక్లాసులో- అది ప్రతి టెక్స్ట్‌బుక్‌నీ ఆపళాన బట్టీ వేసేసేది- దాని బట్టీ వేసే శక్తికి మేం తెగ ఆశ్చర్యపడేవాళ్ళం- ఒక్కో తెలుగు పద్యం-ఒక్కో ఇంగ్లీషు పద్యం- అది ఫుల్‌స్టాప్, కామాలు-కోలన్లు- సెమికోలన్లు హైఫన్లుతో సహా వున్నదున్నట్లు చెప్పేసేది - కాలేజీలో చేరాక పుస్తకాలు పెద్దవైనా బట్టీ మాత్రం మానలేదు- అది అలా అస్తమానం చదువుతుండడం వలన దాన్ని పు-పు సరళ- అంటే పుస్తకాల పురుగు సరళ అనీ- బట్టీ సరళ అనీ ఏడిపించేవాళ్ళు- ఎవరికైనా పొరపాటున క్లాసు ఫస్టువస్తే అక్కడికక్కడే ఏడ్చేసేది- అందుకని

ఉడుకుమోతు సరళ అనికూడా కొంత మంది అనేవాళ్ళు- బి. ఏ. లో గోల్డ్ మెడల్ సంపాదించినప్పుడు మా ప్రిన్సిపాల్ "నువ్వు రిసర్చి చేస్తావోయ్ సరళా!" అని దీవించినప్పుడు అక్కడ మేంఅందరం వుండడాన, దాన్ని అప్పటినించి పి. హెచ్‌డీ. సరళ అనీ, రీసెర్చి సరళ అని కూడా అనేవాళ్ళం - గోల్డ్‌మెడల్సూ సర్టిఫికెట్లు యిచ్చిన బలంతో ఎలాగయితేనేం సరళ పి హెచ్ డి చెయ్యనేచేసింది - తెలుగు వ్యాకరణంలో ఏదో విశేషంమీద - రిసెర్చిచేసి పి.హెచ్ డి సరళ పేరు శాశ్వతంచేసేసింది- అంతే కాదు తను చదివిన కాలేజీలోనే ఉద్యోగం సంపాదించి - ప్రస్తుతానికి యు జి. సి. స్కేలు డ్రా చేస్తూంది - సరళని చూసి ఈమధ్య ఓ సంవత్సరందాటినట్లేవుంది- డబ్బు బాగాకూడబెట్టిందిగావును బంగారం కొనడానికి వెళ్ళింది అనుకున్నాను.

నేను అలా దాన్ని గురించి ఆలోచిస్తూండగానే రిక్షా దిగి లోపలికి వచ్చింది సరళ — వచ్చీరావడంతోనే "ఎన్నాళ్ళకెన్నాళ్ళకి'' అని కౌగలించేసుకుంది - సరళలో ఏదో మార్పు వచ్చిందనిపించింది నాకు.

"ఊరక రారు మహాత్ములు'' అన్నాను.

''తెలుగు మాట్లాడావంటేచంపేస్తాను- నీ బొంద తెలుగూ నువ్వూనూ-" అని ఓ మొట్టికాయవేసింది

సరళేం మారలేదు - అది తెలుగులో గ్రామర్ మిస్టేక్స్ వస్తే చచ్చినా ఊరుకోదు.

"నువ్విప్పుడు నాతోబజారుకి రావాలి- త్వరగా తయారుకావాలి"అన్నదికూర్చుని హ్యాండ్‌బాగ్ తీసి అందులోనుంచి ఓ కవర్లకట్ట యివతలకి లాగింది.

"ఓహో! ఆనందమానందమాయెనే- మా సరళమ్మ పెళ్ళికూతురాయెలే" అని పాట అందుకున్నా.

"అవునుగానీ పద త్వరగా'' అని కవర్లకట్టలోనుంచి నా ఎడ్రస్ గల కవరొకటితీసి చేతికిచ్చింది - కవరు నాలుగు వైపులా పెంటు కలిపిన పసుపు బొట్లు - నిజంగా ఆనందమానందమాయెనే- కవర్లోంచి కార్డు తీయకుండానే "అతనెందులో పి. హెచ్ డీ - తెలుగా ఇంగ్లీషా? అల్జీబ్రా, సైన్సా, డాక్టరా, ఇంజినీరా?" అన్నాను.

''నువ్వింకా పాతకాలపు తుక్కుకంపే కొడుతున్నావ్!'' అంది సరళ.

దాని అలంకరణలో మార్పుకీ, దాని కళ్ళల్లో వెలుగుకీ, మాటల్లో హుషారుకీ అర్థం యిదన్నమాట!

''అతనెవరో ఏం కాదు - దాబా గార్డెన్స్‌లో పాన్సీ షాప్‌వుంది చూశావా? శంకరం మామయ్య అని నీకూ పరిచయం చేశానే-అతనే, చదువంటావా ఎం. ఏ. బి. ఎఫ్."

అవును శంకరంగార్ని నాకుపరిచయం చేసినప్పుడుకూడా అతని డిగ్రీ ఇలానే చెప్పింది సరళ- నేనుఇంటికి వచ్చి చాలా అమాయకంగా "మా తమ్ముణ్ణి "ఎం. ఏ. బి. ఎఫ్" అంటే ఏమిట్రా?" అని అడిగేను.

అప్పుడు వాడు అర్జంటుగా, హాలులో పేపరుచదువుతున్న మా నాన్నగారి దగ్గరకెళ్ళి- "అబ్బో! మా చిట్టితెలివేవేరు-దాని ఐ. క్యూ బ్రహ్మాండం-అందుకే బ్యాంక్ ఆఫీసర్స్ పరీక్ష యిట్టే ప్యాసైపోయి ఆఫీసరైంది అని చెబుతాలే! చూడండి ఆవిడ ఐక్యూ: ఎం. ఎ.బి ఎఫ్ అంటేనే తెలీదట!" అని వెక్కిరించేడు.

వాడికి పాపం ఇంజినీరింగ్ ఎంట్రెన్సులో ర్యాంక్ నాలుగక్షరాలమీదవచ్చింది అప్పటినించే ఉడుకుమోత్తనం హెచ్చింది.




"అదా చిట్టీ- అదేమిటంటే మెట్రిక్యులేషన్ ఎప్పియర్డ్ బట్ ఫెయిల్డ్ అన్నమాట!"అనివివరించేరు మా నాన్నగారు.

"ఇదెలా కుదిరిందోయ్-" అన్నాను నేను సరళని.

"నువ్వు కూడా ఇలా ఆశ్చర్యపడతావనుకోలేదోయ్- అయినా తరువాత మాట్లాడదాం. పద-పద-" అని తొందరచేసింది

"ఏం కొంటావ్!" అన్నాను-

"ఇదుగో. ఇప్పుడే ఈ గాజుల జత తీశాను- ఈ వుంగరం కూడా తీశాను-ఇక పట్టు చీరెలు తియ్యాలి-పద త్వరి- అందుకే పనికట్టుకుని బెజవాడొచ్చాను-" అంది- ఇద్దరం బజార్లోకి వచ్చాం. వెయ్యిరూపాయల్లో పెద్ద అంచున్న జరీ పట్టు చీరె కావాలట- రెండు వైపులా పెద్ద బార్డరుండాలట- వెయ్యిరూపాయలకి మించరాదట. ఎర్రదైతే మరీ బాగుంటుందట - షాపులన్నీ గాలించి గాలించి చివరికెలాగో సాధించాం.నన్ను ఇంటి దగ్గర దిగబెట్టి వెడుతూ-"పెళ్ళి పన్నెండున కదా!నువ్వు పదకొండే రావాలి-'' అని చెప్పింది-

"తప్పకుండా'' అన్నాను- ఎందుకంటే సరళ నాకు ఐదో క్లాసు నించే స్నేహితురాలు-టీనేజి దాటి- ట్వంటీకూడా గడచి ఇప్పుడు ముప్పైల్లోకి వెళ్ళబోతున్నాం- అప్పుడు మాచిన్నప్పుడు మాఇద్దరికీ మధ్య రహస్యాలుండకూడదని ప్రమాణం చేసుకున్నాం- మా అమ్మా నాన్నలతగాదాల దగ్గర్నుంచీ ఇంట్లో విశేషాలన్నీ ఒకళ్ళకొకళ్ళం చెప్పేసుకునేవాళ్ళం ఇప్పుడైనా కలుసుకున్నప్పుడుకష్ట సుఖాలు కలబోసుకోవడం మాకుఅలవాటే. బహుశా సమయం లేకపోవడంవలన తన పెళ్ళి విశేషాలు సరళ చెప్పలేదేమో అని సరిపెట్టుకున్నాను

మరునాడు బ్యాంక్‌నుంచే ఇంకో స్నేహితురాలు జయలక్ష్మికి ఫోన్‌చేసి సరళ పెళ్ళిసంగతి చెప్పాను.

"అవునోయ్-సరళ ఎప్పుడో పెళ్ళి చేసుకుంటుందని మేం అనుకుంటూనే వున్నాం- వాళ్ళ అమ్మా నాన్నా మరీనూ కొడుకు పైసా పంపడంలేదని దీని సంపాదనంతా వాడేసుకుంటున్నారు టీ వీ కూడా కొన్నారు తెలుసా? దాని బ్రతుక్కి ఓ గమ్యం ఎలాగనుకున్నారు? అంది జయ.

## తపన

కౌగిళ్ళ గురించి మాట్లాడను
క్రూరతనపు గుండె
గుబుళ్ళ గురించి మాట్లాడను
వికసించి వేధించే పూల
నెగళ్ళ గురించి మాట్లాడను

అర్ధరాత్రి - నిద్రపట్టని
నా ఒంటరితనంలోకి
నిశ్శబ్దంగా తీరం చేరే పడవలాగ
ఆలోచనల అలలను
సుతారంగా కదిలించే
తన గురించి మాట్లాడాలని వుంది.
పట్టు జెండాలాగ వూగే
తన చిరునవ్వు వెలుతురు గురించి
మాట్లాడాలని వుంది.

* * *

వర్షా వేళ
గుండె ఉయ్యాల
ఒక్క ఉదుటున నేల నించి
నింగికి ఎగసినప్పుడు
నా రంగుల కలల ధూళి
ఇంద్రధనువై
దారికలు కడుతుంది
శరత్కాలపు మధ్యాహ్న వేళ
గోదావరి ఇసుక మీదకు జారే
పారదర్శకమైన అలవొకటి
నా కాళ్ళక్రింద నేలను
దొలుచుకుపోతుంది
హేమంతంలో చలిపొగలు జిమ్మే
మసక వెన్నెల తెల్లవారు జామున
కిటికీ అవతల పూలరెమ్మ
పరిమళాన్ని దరహసిస్తూ
రవంత లోపలికి తొంగి చూసి
నింగి అంచును నా కందిస్తుంది
నా మనశ్శిరం దిగులుగా
అశ్రుపత్రాక్షరాలను రాలుస్తుంది

* * *

రక్తికీ విరక్తికీ నడుమ
అనురాగ సంధ్యలో
నా ప్రాణ చైతన్యం తను-
నన్ను రిక్తుణ్ని చేసి
చాలా కాలమైంది.
అందుకే-
కౌగిళ్ళ గురించి మాట్లాడను
క్రూరతనపు గుండె
గుబుళ్ళ గురించి మాట్లాడను.

—ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

"బ్రతుక్కి పెళ్ళేనా గమ్యం?" అనే ప్రశ్నముందు ఓ చిన్న బిందువులా మెదడులో మెదిలి- చివరికి మెదడంతా ఆక్రమించేసింది.

కొడుకులు వేరు కూతుళ్ళు వేరూనా? కొడుకుల సంపాదన తినవచ్చుగాని కూతుళ్ళ సంపాదన తినకూడదా? కొడుక్కి చెప్పించిన చదువే కూతురికీ చెప్పించారు. ఆమెకన్న అతనికెక్కువేం చేశారని? ఈ విషయంలో అమ్మ నన్ను పరాయిదాన్ని చేయడాన్ని నేను సహించలేకపోయేదాన్ని.

"దాని డబ్బువాడకండి" అంటూ అస్తమానూ గొడవ చేస్తూనే వుంటుంది. మా అన్నయ్య జీతం తేగానే వాడి ఖర్చుకిచ్చి తక్కినది తను తీసేసుకుంటుంది అమ్మ- ఓసారి అన్నయ్య పుట్టిన రోజుకి నేను బట్టలుకొంటేదానికి అమ్మ చాలా రాద్ధాంతం చేసింది. అన్నయ్యకి కోపంవచ్చింది. అన్నయ్యని ఎలాగో బతిమిలాడి కోపం పోగొట్టానుగానీ అమ్మతో వారంరోజులు మాట్లాడలేదు.

"నీమంచి కోసమేనే!" అమ్మ ఓరోజు ముక్కుచీదేసింది. అప్పుడు నేను అమ్మకి ఓషరతు పెట్టాను. ఏదైనా అకేషన్ వచ్చినప్పుడు నేను ఎవరికైనా బహుమతి కొంటేతను మాట్లాడకూడదని. సరేనంది.

"ఏం లేదు చిట్టీ! నీ బ్రతుక్కి ఓ దారి ఏర్పడాలని" అంది అమ్మ అప్పుడు. 'దారి ఏర్పడ్డం' అంటే పెళ్ళిచేసుకోడం! పెళ్ళి సంబంధాల వేట సాగుతూనే వుంది మా ఇంట్లోనూ.

"అతను బాగానే వున్నాడుగానీ- మరీ పెద్ద కుటుంబం - అక్కలూ - చెల్లెళ్ళూ అయిదుమంది- ఏమో అంత కుటుంబంలో అమ్మాయి సుఖపడదు" అనేవాడు నాన్న.

"మనమ్మాయికి వెయ్యిపైనే జీతం వస్తోంది గదండీ-అతని సంపాదనంతా వాళ్ళకిపెట్టినా! కుర్రవాడు ఈడూ జోడుగా వున్నాడు-" అన్నది అమ్మ - "నీకు తెలీదు వూరుకో-వాళ్ళ బేరాలు అవీ చూస్తుంటే నాకు వాళ్ళు దీని ఉద్యోగం కోసమే చేసుకుంటున్నారనిపించింది-పెళ్ళి కాగానే జీతం తెచ్చి దోసిట్లో పొయ్యమనేదెంత మంది? ఏమైనా ఆ ఫామిలీ కల్చర్ నాకు నచ్చలేదు- ఏమంటావ్ చిట్టీ!" అన్నారు నాన్న-

"అవును నాన్నా-" అన్నాను నేను.

ముఖం ఎర్రగా వుంది-కళ్ళు బాగున్నాయి- ఎత్తూ లావూ సరిపోయింది- కానీ-అతని సంస్కారం-సహృదయం- నాకేం తెలుసు? ఎన్నో వందల మైళ్ళ అవతల పెరిగి, వచ్చి మెళ్ళో తాళికట్టి సాంబ్రాణి కడ్డీలు వెలిగించి. దీపంఆర్పేస్తే ఆ మనిషి కౌగిట్లో నేనెలా కరిగిపోగలను? నాన్న మాటలకి నేనందుకే తాళం వేసేను-కొన్ని సంబంధాలు అలా పోగా తరువాత నేను పెళ్ళి చూపులకి కూర్చోనని తిరగబడిపోయాను- ఓ ఏడాదిగా - ఇది మా ఇంటి చరిత్ర-

సరళ పదకొండుకి రమ్మంటే నేను పదినే బయల్దేరాను-పది ఆదివారం వచ్చిందని-నాకోసం ఎవరూ స్టేషన్‌కి రాలేదు- వైజాగ్ నాకేం క్రొత్తకాదు - అందుకని నేనే వెళ్ళగలిగాను- వాకిట్లో పందిరీ పచ్చతోరణం, సందడీ, సంరంభం నాకేం కనిపించలేదు - ఈ రోజుల్లో పందిళ్లేం వుంటాయి-పెళ్ళికి ఓ గంట ముందొస్తుగా షామియానా వేస్తారు తప్ప-అని సర్దిచెప్పుకొని లోపలికి వెళ్ళేను- పెళ్ళికొడుకు పరాయి వాడేం కాదు. రక్తం పంచుకుని పుట్టిన తమ్ముడు సరళ తల్లికి. అయినా

ఆవిడ ముఖంలో నేనాశించిన సంతోషం లేదు-సరళ తండ్రే కొంచెం హుషారుగా కనిపించేడు.

పెళ్ళికి సరళ వదినె రాలేదు- అన్న వచ్చేడు .

"ఏమిటో దీని తొందర-పెళ్ళికొడుకు లకి దేశంలో కరువొచ్చినట్లు-మా మరద లికి ముప్పైఆరు మొన్న సోమవారం పెళ్ళి జరిగింది. దీనికింకా ముప్పై ఒకటేగా తొందరపడి ఆ శంకరంగాణ్ణి కట్టుకోక పోతేనూ!" అని దీర్ఘం తీశాడాయన.

"సంపాదనంతా చెల్లెళ్ళకి - తల్లి కి తండ్రికి ఖర్చవుతోందని ఆడపిల్లలకి బాధ" అని వో చురక అంటించింది సరళ చెల్లెలు. వాళ్ళ మాటల తీరు నచ్చక నేనక్కణ్ణుంచి వెళ్ళేను.

సాయంత్రం ఎవరో స్నేహితురాలికి పెళ్ళి కార్డు యిచ్చే నెపంమీద మేం ఇద్దరం శంకరం యింటికి వెళ్లేం.

శంకరానికి తండ్రి లేదు - తల్లివలన ఏమీ ప్రయోజనంలేదని. సరళ తల్లి ఆమెని కనిపెట్టివుంటదు.

"ఏం అమ్మమ్మా - నేను సరళని" అని పలకరించింది సరళ. ఆవిడకి చూపు సరిలేదు కాబోలు-

"నా బంగారు తల్లే - పెళ్ళి కూతుర్ని చేశారా!" అని చెంపలు నిమిరింది.

"ఇంకా లేదు - రేపు ఇదిగో నీకోసం పట్టుచీర తెచ్చాను. రేపు కట్టుకొని పెళ్ళికి రా!"అని చేతిలో ప్యాకెట్ ఆవిడ చేతిలో పెట్టింది.

శంకరం స్నానం చేసి వచ్చినట్లున్నాడు.

"ఎంత తొందరే నీకు - అప్పుడే వచ్చేవ్!" అన్నాడు. సరళని చూసి అతని మొహం సంతోషంతో పొంగడం నేను గమనించాను.

"మా ఫ్రెండ్‌కి పరిచయంచేద్దామని" అని నవ్వింది. నవ్వి లోపలికి వెళ్ళింది. వెళ్ళి కాఫీ కలుపుకొచ్చింది. కాఫీ త్రాగుతూ చెప్పింది. కాలేజీకి సెలవు పెట్టి ఎన్నోసార్లు ఇక్కడ కూర్చుని కాఫీ త్రాగుతూ కబుర్లు చెప్పాననీ-

"నేను డబ్బు పుట్టింటికి ఇవ్వవలసి వస్తుందని మామయ్యని చేసుకుంటున్నానని మా వాళ్ళకి అపోహ! మామయ్య ఏమన్నాడో తెలుసా! పెళ్ళి అయినా నువ్వు ఇవ్వాలనుకుంటే నీ జీతంమొత్తం వాళ్ళకే యివ్వు. అదంతా నీ యిష్టం-అని ఒకే తల్లి కడుపున పుట్టినా అమ్మకీ, మామయ్యకీ ఆలోచనల్లో ఎంతో తేడా!" అంది సరళ.

శంకరం బట్టలు వేసుకుని వచ్చి మా దగ్గర కూర్చున్నాము. సరళ ప్రక్కన కూర్చుంటే వాళ్ళిద్దరూ ఒకరికోసం ఒకరు పుట్టినట్టు వున్నారు.

సరళ పెళ్ళి చాలా నిరాడంబరంగా జరిగిపోయింది. అంతే కాదు. మరో ఆశ్చర్యం ఏమిటంటే. పెళ్ళి తరువాత వేడుకా లేకుండా అదే సాయంత్రం సరళ తన పెట్టి తీసుకుని శంకరం యింటికి వచ్చింది. ఆ రాత్రే వాళ్ళిద్దరూ మెయిల్ ఎక్కి హనీమూన్‌కి వెడుతూంటే నేనూ వాళ్ళతోనే బయలుదేరి విజయవాడలో దిగేశాను.

సాయంత్రం బ్యాంక్ నించి రాగానే అమ్మ పెళ్ళి విశేషాలు అడిగింది-

"మనసిచ్చి పుచ్చుకోడానికి చదువులు అడ్డులేవు-మనసు ముఖ్యం అని కదా మీ సరళ ఉద్దేశ్యం! అంతేనా?" అందిఅమ్మ. అవునను కుంటాను"అన్నానునేను.రాత్రి లోఆచిస్తూ పడుకున్నాను. కిటికీలో నుంచి నక్షత్రాలు కనిపిస్తున్నాయి. సరళ పుస్తకాలపురుగు అయితే కావచ్చు. అది పట్టుదల మనిషి-విజ్ఞత కల మనిషి అనిపించింది-


ఆమె సంపాదన కోసం తల్లీ తండ్రీ పెళ్ళి వాయిదా వేస్తున్నారని సరళకితెలుసు చదువు తక్కువ అనే నెపంతో శంకరానికి యివ్వకపోతే- సరళ ఇంకెవర్నీ చేసుకోదని వాళ్ళు అర్థం చేసుకుని శంకరాన్ని చేసుకుంటే మేం నీతో మాట్లాడం అని శపథం చేశారనీ గ్రహించింది.

మనుష్యుల్ని నడిపించేది డబ్బు ప్రేమల్ని పెంచేదీ తుంచేదీ కూడా డబ్బే.

తండ్రి పెన్షన్ ఇలటి ఖర్చుకి చాలు. కానీ తక్కిన పిల్లల చదువులకి. వాళ్ళ పెళ్ళిళ్ళకి చాలదు. ఎదిగి వచ్చిన మగవాడు రెక్కలు చాచి ఎగిరిపోయాడు. అతడు ఆరు నెలలకొకసారి అతికష్టంమీద అయిదు వందలు పంపితే ఎక్కువ అందుకే సరళని చెయ్యిదాటి పోనీకుండా వుండడానికి వాళ్ళు "శంకరం వద్దు పెద్ద సంబంధం చూస్తాం అంటారు. పెద్ద సంబంధానికిసరళ వొప్పుకోదని తెలుసు. నాకు తెలుసు సరళ జీతం రాగానే వాళ్ళకి అంతో ఇంతో సర్దుతుంది దానికి శంకరం అభ్యంతరంచెప్పడు.అతనికి సరళ జీతం మీద ఆధారపడాల్సిన అవసరం లేదు. సరళ డబ్బు యిస్తుంటే వాళ్ళ రాకపోకలు మొదలౌతాయి. చుట్టరికాలు పునరుద్ధరింపబడతాయి తాత్కాలికావేశాలు చల్లారతాయి.

రెండు రోజులు పోయాక ఓ రోజు అమ్మ భోజనాల దగ్గర అంటోంది.

"ఏమండీ!మా పినతల్లి కొడుకు కృష్ణ బాగుంటాడు- వాళ్ళకి టైప్ ఇన్‌స్టిట్యూట్ వుంది. ఇల్లూవాకిలీ వున్నాయి- నెలకి



వెయ్యిపైనే సంపాదిస్తాడు- మన చిట్టిని చేసుకుంటాడేమో కనుక్కుందామా! నాన్న తెల్లబోయారు.

"ఏమిటి నువ్వనేది- వాడు చదివింది ఇంటరే! మొన్న ప్రయివేట్‌గా బి. ఏ చదివాడు- నెగ్గాడో, లేదోగాని."

"చదువుదేముందండీ- మనసులు కలవాలిగానీ-"

"ఓహో? అయితే మా చిన్నక్క కొడుకు లేడూ మోహన్! వాడికిద్దాం-" నాన్నది వెక్కిరింపో నిజమో అర్థం కాలేదు.

"ఏం సరళ పిహెచ్‌డి చేసి, ఎస్సెల్సీ ఫెయిల్ అయినవాడిని చేసుకోలేదూ?" అంది అమ్మ.

"ఓహో! అదా సంగతి!" నాన్న నవ్వారు.

"పిల్లదాని డబ్బుకోసం చెయ్యట్లేదని నలుగురూ అనుకుంటారండీ" అంది అమ్మ ఆవేదనగా.

నాన్నఏమీ మాట్లాడలేదు.

"కృష్ణ దొరబాబులా వుంటాడు! పెళ్ళయినాక ప్రయివేట్‌గా చదువుకోకూడదా ఏం?" అంది అమ్మ మళ్ళీ.

అమ్మ అలా ఎందుకన్నదో నాకు తెలుసు. మా అమ్మ చెల్లెలు- అంటే మా పిన్ని తనకన్న తక్కువచదివిన ఆయన్ని చేసుకుని, ఆయనచేత బలవంతాన చదివించింది. అందుకని!

నాకు నవ్వొచ్చింది.

"ఏతుడుకాముచ్చట అన్నారు!" అని అక్కడనించి వెళ్ళిపోయింది అమ్మ-

సాయంత్రం మామామయ్య, అత్తయ్య వచ్చేరు. ఆయన తన ఫ్రెండు కొడుకు వున్నాడని, అతనికిమంచి ఉద్యోగంఅనీ- యాభై వేలిస్తే చాలనీ-చెప్పేరు.

"యాభై వేలయినా ఫరవాలేదన్నయ్యా! అది దాచుకున్న డబ్బే నలభై వేలున్నాయి. ఇంకో పాతిక మేం వేసుకుంటాం నువ్వు ఈ సంబంధం చెయ్యజారి పోనివ్వకు" అంది అమ్మ ఆదుర్దాగా.

'టీ' తాగుతూన్న నాకు కడుపులో తిప్పి వాంతి అయింది.

'ఒంట్లో బాగా లేదా ఏం?' అని ఆత్రంగా అడిగింది అమ్మ.

'వాళ్ళది చాలా మంచి కుటుంబం వదినెగారూ! మరో పది ఖర్చయినా ఇలాంటి సంబంధాలు వదులుకోకూడదు' అని సలహా యిచ్చింది మా అత్తయ్య.

మేం వుంటున్న ఇల్లు కొనేటప్పుడు ఇలాగే బేరం జరిగింది! మంచి ఇల్లు- తూరుపు ముఖం. వసారా పెరడూ- వాకిట్లో చోటూ అంతా బావున్నాయి. మరో పాతికైనా పెట్టవా అని అమ్మ గొడవ చేసింది.

నేను సంపాదించి కూడబెట్టిన డబ్బు మా నాన్న ప్రావిడెంట్‌ఫండ్‌లో డబ్బు ఇదంతా ధారపోసి-నేను ఓ మనిషినితెచ్చుకుంటే తరువాత?

"అతను పెద్ద ఆఫీసర్ కదా! ట్రాన్స్‌ఫర్‌లు అవుతుంటాయి కూడా కదా! ఇంక నేను ఉద్యోగం చెయ్యడానికి పడదు" అన్నారు మామయ్య.

"చెయ్యకపోతే ఏం ఫరవాలేదులే. చేసినంత చాలు" అంది అమ్మ.

'వాళ్ళింటి కోడళ్ళెవరూ ఉద్యోగాలు చేయకూడదట! అసలు వాళ్ళెప్పుడూ బయటికి రారు" అంది మా అత్తయ్య.

వాళ్ళనంతసేపూ ఆ గొప్ప ఖరానా సంబంధం గురించి శక్తి వంచనలేకుండా చెప్పారు. వాళ్ళు వెళ్ళాక అమ్మ పోరడం మొదలైంది.

"మీరు వెళ్ళి వాళ్ళని అడిగిరండి" అంటూ.

"ఆదివారం వెళతాలేవే. అతనూ ఇంట్లో వుంటాడు" అన్నారు నాన్న.

"ఆదివారానికింకా నాలుగు రోజులు వ్యవధి వుంది. శనివారం వెడితే మద్రాసు రాత్రికి చేరతారు. ఆదివారం పెళ్ళి కొడుకుని చూస్తారు.

శనివారం నాన్న టికెట్ కొనడానికి బయలుదేరుతూ "నేను స్టేషన్‌కి వెడుతున్నా చిట్టీ" అన్నారు.

'వద్దు నాన్నా' అన్నాను నేను.

'ఏం?'

'నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు.'

'అదేం?'

'పెళ్ళి చేసుకోవాలి అనిపించినప్పుడు అప్పుడు —" అని ఆగాను.

'అప్పుడు సంబంధాలొస్తాయా?' అంటూ అక్కడికొచ్చింది మా అమ్మ.

'ఎవరైనా మంచి మనిషి నాకు కనిపించినప్పుడు పెళ్ళి చేసుకోవాలి అనిపించినప్పుడు.'

అమ్మ మాటలు ఇక నేను వినలేదు. నాన్న చెప్పులు విప్పడం మాత్రం చూశాను. ఇన్నాళ్ళు ఇదమిత్థంగా లేని ఆలోచనలకి ఇప్పుడొక మార్గం కనిపించినట్లనిపించింది. మబ్బులన్ని వర్షించి ఎండ పొడవచ్చినట్లనిపించింది. పలక నిండా గీసిన పిచ్చి గీతలన్నీ చెరిపి ఒకే ఒక్క సరళరేఖ గీసినట్లనిపించింది. ●

## బుంగ్‌లం

డిస్కో డ్యాన్సు
ఫ్యాషన్ జీన్సు
ప్రియురాల్తో రొమాన్సు
సిల్లీగా చూడకు దేన్నీ

ఖర్చుల మయమేనోయ్ అన్నీ.
సిటీ బస్‌లో పరుస్సు
అశోకామెస్‌లో పెరుస్సు
రేసుల్లో హారుస్సు
ఎటువైపో పోతూవుంటాయ్
తమ అడ్రస్‌కనుక్కోమంటాయ్!
ఖద్దరు చొక్కా
విస్కీ చుక్కా
మాంసం ముక్కా
కాదేదీ కాకా కనర్హం
బొనొను బాకాలనర్హం!
ఉండాలోయ్ రేషన్ కార్డు
ఉండదటోయ్ "నో స్టాకు" బోర్డు
ఎవడోయ్ నీ బ్రతుక్కి గార్డు
ఓటుంటే అమ్మేసి
బతికుంటే ఆకులు మేసి
నా దేశం శాపగ్రస్తుల వరం
ఆవేశం గుండెల్లో శరం!

—ఎ.బి. చన్ద్ర

[మహాకవి శ్రీశ్రీకి క్షమాపణలతో]

● రుగ్మతలు